సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



రెండుపూరిళ్లు దగ్ధం

బలిజిపేట మండలం అజ్జాడ గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు, పశువులశాల దగ్ధమయ్యాయి. - 8లో



ఘనంగా పైడితల్లి అమ్మవారి చండీయాగం

- 8లో

పైడితల్లి వనంగుడిలో చండీయాగాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు.

22న సాలూరులో 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాలూరులో ఈ నెల 22న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులందరూ పాల్గొని సాలూరు పట్టణం, మండలవాసులు వివిధ సమస్యలపై అందజేసిన వినతులు స్వీకరిస్తారన్నారు. అర్జీలకు పరిష్కారం చూపుతామన్నారు.

న్యూస్‌రీల్

నిలిచిపోయిన హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

జామి: భీమసింగి గోస్తనీ నదిపై ఉన్న వంతెనపై హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గురువారం 15 నిమిషాలపాటు నిలిచిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి హౌరా వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో భీమసింగి వంతెన వద్ద పొగలు రావడాన్ని సమీపంలో వనం పద్మనాభం అనే పశువుల కాపరి గమనించి పెద్దగా కేకలు వేశాడు. దీంతో రైలులో ప్రయాణిస్తున్న వారు చైన్ లాగడంతో రైలు నిలిచిపోయింది. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రైల్వే సిబ్బంది పరిశీలించి... బ్రేక్ బైండింగ్ వల్ల అప్పుడప్పుడు పొగలు వస్తాయని, ప్రమాదం ఏమీ ఉండ దని తెలిపారు.

దివ్యాంగులను ఆదుకుందాం



దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పీఓ కల్పనాకుమారి

భామిని: దివ్యాంగులు, వయోవృద్ధులను ఆదుకుందామని, వారికి మేలు చేయడంలో వలంటీర్లు ముందుండాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. భామిని మండల కేంద్రంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఐటీడీఏ పీఓ కె.కల్పనాకుమారితో కలిసి గురువారం ప్రారంభించారు. సదరం ధ్రువీకరణ పత్రాలున్న వారికి యుఐడీ నంబర్లను సచివాలయాల్లో కేటాయించాలన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అర్హత పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సహాయ సంచాలకురాలు పి.కవిత, ఎంపీడీఓ ఉమామహేశ్వరి, వెలుగు ఏపీఓ జి.భవానీ, ఎంపీపీ తోట శాంతి కుమారి, జెడ్పీటీసీ బొడ్డేపల్లి చిన్నమ్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట సింహచలం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం

పార్వతీపురం: ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గర్భిణులు, చిన్న పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, జగనన్న ఆరోగ్య సురక్ష, వ్యాక్సినేషన్, బాల్య వివాహాలు, ఐసీడీఎస్‌లో ఉద్యోగాల ఖాళీలు, విద్యాశాఖ తదితర శాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, జేసీ ఆర్.గోవిందరావు, డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డీఈఓ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు నమోదులో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 25వ తేదీలోగా ఓటరు నమోదు దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. డిసెంబర్‌లో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులబృందం పర్యటన ఉంటుందని, ఓటరు జాబితా తయారీలో లోపాలను గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు జాబితాలో చనిపోయిన, శాశ్వతంగా వలసపోయిన వారి పేర్లను వెంటనే తొలగించాలన్నారు. బలిజిపేట మండలంలో చనిపోయిన వారి పేర్లు ఎక్కువగా ఓటరు జాబితాలో ఉన్నట్లు గుర్తించామని, వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు, ఆర్డీఓ కె.హేమలత, ఎం.లావణ్య, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అభిప్రాయ సేకరణ

విజయనగరం అర్బన్: జిల్లాలో చేపడుతున్న కులగణన సర్వే ప్రక్రియపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఈ నెల 18న కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జిల్లా బీసీ, సంక్షేమ సాధికారత అధికారి కె.సందీప్‌కుమార్ తెలిపారు. నిజమైన అర్హత కలిగి ఉండి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో జరగనున్న కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు.

రాజాంలో సామాజిక రాజసం

- వెల్లువెత్తిన సామాజిక చైతన్యం
- వెనుకబడిన వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు చేసిన మేలును వివరించిన స్పీకర్, పాలకులు
- వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పిలుపు
- సామాజిక సాధికార యాత్రకు భారీగా తరలివచ్చిన జనం
- జగన్నినాదంతో మార్మోగిన సభాప్రాంగణం



రాజాం అంబేడ్కర్ కూడలిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం అంబేడ్కర్ కూడలిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాజాం: ఎటు చూసినా జనమే.. అందరి ముఖాల్లో ఆనందమే. ఆటోలు, టాటా మ్యాజిక్ వ్యాన్‌లు, బొలేరాలు, ట్రాక్టర్లు, కార్లు, బైక్‌లు ఇలా.. అందుబాటులో ఉన్న వాహనాలపై కొందరు... నడకదారిలో మరికొందరు.. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నుంచి వేల సంఖ్యలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజాప్రతినిధులు రాజాం పట్టణానికి చేరుకున్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో భాగస్వాములయ్యారు. జగన్‌మోహన్ రెడ్డి సర్కారు వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును పాలకులు వివరిస్తుంటే చప్పట్లతో స్వాగతించారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినదించారు. బడుగుల జీవితాలను సాధికార వసంతాలతో నింపి, భవిష్యత్తుకు వారధి వేసిన నవ నిర్మాణ ధీరోదాత్తుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటూ కొనియాడారు. ప్రజాచైతన్యంతో రాజాంలో సామాజిక రాజసం ప్రతిబింబించింది.

బస్సు యాత్ర సాగిందిలా..

రాజాం మండలం బొద్దాం గ్రామంలో తొలుత గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను పాలకులు ప్రారంభించారు. ప్రెస్‌మీట్ నిర్వహించారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా సాయంత్రం 3.30 గంటలకు రాజాం పట్టణానికి బస్సుయాత్ర చేరింది. అంబేడ్కర్ జంక్షన్ వద్ద జేజే ఇనోటెల్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభాప్రాంగణమంతా వైఎస్సార్‌సీపీ జెండాలతో కళకళలాడింది. సుమారు కిలోమీటరు మేర పాదయాత్రగా వచ్చిన పాలకులకు తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలు, కోలాటాప్రదర్శనలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, శంబంగి చినఅప్పలనాయుడు, నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు పేరాడ తిలక్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన రావు, శిష్టకరణాల కార్పొరేషన్ చైర్మన్ అనూషా పట్నాయక్, దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రంగుముద్రి రమాదేవి, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, డాక్టర్ తలే రాజేష్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కంబాల సందీప్, వైఎస్సార్ సీపీ రాజాం కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తదితరులు పాల్గొన్నారు.



బొద్దాంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

కనీవినీ ఎరుగని అభివృద్ధి: ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం నియోజకవర్గంలో ఎన్నడూ చూడని విధంగా సామాజిక, సంక్షేమ అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. నియోజకవర్గంలో నవరత్నాల పేరుతో డీబీటీ కింద అర్హులకు రూ.1176 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ.204 కోట్ల ఆర్థిక ప్రయోజనం వెనుకబడిన వర్గాలకు కలిగిందన్నారు. 85 సచివాలయ భవనాల నిర్మాణాలకు రూ.33.70 కోట్లు, 86 ఆర్‌బీకే భవనాలకు రూ.17.66 కోట్లు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి మరో రూ.17.66 కోట్లు, బల్క్ మిల్క్ కేంద్రాలకు రూ. 3.47 కోట్లు, లైబ్రరీలకు రూ.3.84 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నాగావళి నదిపై రుషింగి, కిమ్మి గ్రామాల మధ్య వంతెన నిర్మించిందని, తోటపల్లి రెగ్యులేటర్ కుడి కాలువ ఆధునికీకరణ పనులు పూర్తిచేస్తోందన్నారు. రాజాం రహదారి విస్తరణ పనులు గతంలో రూ.10 కోట్ల వ్యయంతో పూర్తిచేయగా, తాజాగా మరో రూ. 20 కోట్ల ఖర్చుతో పనులు జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలో పదివేల పక్కా ఇళ్లు, 3,200 ఇళ్ల స్థలాలు ఇచ్చామని వివరించారు. నియోజకవర్గం మొత్తంపై జల్‌జీవన్‌మిషన్ కింద రూ.133.97 కోట్ల ఖర్చుతో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నట్టు వెల్లడించారు.

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం: ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంత్రివర్గంలోని 25 మందిలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నేతలకు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. దేశంలో తొలిసారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఓసీల నుంచి ఒక్కో ఉపముఖ్యమంత్రిని చేయడం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని చెప్పారు. బడుగు బలహీనవర్గాల అక్కచెల్లెమ్మలే సభ్యులుగా ఉన్న డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ మేరకు ఇప్పటికే మూడు దఫాల్లో సొమ్ము చెల్లించారని, జనవరిలో నాలుగో దఫా ఇవ్వనున్నారని చెప్పారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద, ఆరోగ్యశ్రీ ఇవన్నీ సామాజిక వర్గాల ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలని వెల్లడించారు.

అభివృద్ధి అంటే ఇదే: స్పీకర్ తమ్మినేని



సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చిన ప్రజాస్పందన చూస్తుంటే జగన్‌మోహన్ రెడ్డి సర్కారు సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను ఏ స్థాయిలో స్వాగతిస్తున్నారో స్పష్టంగా తెలుస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈ యాత్రలతో రానున్న ఎన్నికల ఫలితాలు ఇప్పుడే కనిపిస్తున్నాయన్నారు. తాండ్ర పాపారాయుడు పుట్టిన రాజాం గెడ్డపై అవినీతికి తావులేదని, ఇక్కడ ప్రజాసేవ చేసిన వారినే ప్రజలు గెలిపిస్తారని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, పూలే ఆశయాలు వంటివన్నీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అమలు చేయగలుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందాడని, రాష్ట్రంలో జీడీపీ పెరిగిందని, పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు విశాఖపట్నం వస్తున్నారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు.

ప్రజావిశ్వాస యాత్ర: ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



ప్రస్తుతం జరుగుతున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రలు... ప్రజావిశ్వాస యాత్రలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలను మోసం చేసిన టీడీపీపై దండయాత్రలని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. నాలుగున్నరేళ్లుగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయడమే యాత్రల ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతిహామీని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, దీనికి సాధికార యాత్రలకు లభిస్తున్న జనస్పందనే నిలువెత్తు సాక్ష్యమన్నారు.

సామాజిక అభివృద్ధి కనిపిస్తోంది: ఎంపీ బెల్లాన



జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాలుగున్నరేళ్లలో సామాజిక వర్గాలను ఆదుకుందని, ఈ అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రంలో ప్రతిచోట జరుగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రలకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు పదవులు, ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

పేదలు– పెత్తందారుల మధ్యే పోరు: జెడ్పీ చైర్మన్



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పేదలు– పెత్తందారుల మధ్య పోరు జరగనుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పేదవర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, టీడీపీ కార్పొరేట్‌కు కొమ్ముకాస్తోందని విమర్శించారు. మంత్రి బొత్స సత్యనారాయణ నాయకత్వంలో గత ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 ఎమ్మెల్యే స్థానాలు, మూడు ఎంపీ స్థానాలు దక్కించుకున్నామని, ఈ దఫా కూడా శతశాతం విజయం మనదేనని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు హామీలు నమ్మవద్దని ప్రజలను కోరారు.

టీడీపీది దోపిడీ పాలన: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



టీడీపీది దోపిడీచేసే నైజమని, గతంలో కులవృత్తులకు పరికరాలు ఇచ్చినట్టు నటించి టీడీపీ కార్యకర్తలకు ముట్టజెప్పిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. పాలకొండ నియోజకవర్గంలో సామాజిక వర్గానికి వచ్చిన నాలుగు చక్రాల సబ్సిడీ వాహనాలను టీడీపీ పాలకొండ నియోజకవర్గ నేత, వీరఘట్టం నేతలు తమ సొంత ప్రయోజనాలకు వినియోగించుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని మరింత దూరంపెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



సామాజిక సాధికార యాత్రలో అలరించిన ఆటాపాట



సామాజిక సాధికార యాత్రకు జేజేలు...



నవరత్న వికాసం

రాష్ట్రంలో ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలన నిర్విఘ్నంగా సాగుతోంది. ఇంటింటా 'నవరత్న' వికాసం స్పష్టంగా కనిపిస్తోంది. పేదవర్గాలు ఆర్థికోన్నతి చెందుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సిద్ధించింది. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు చేరువవుతున్నాయి. నాలుగున్నరేళ్లుగా సాగుతున్న సంక్షేమ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తమ జీవితాలు బాగుపడ్డాయని చెబుతున్నారు.

సొంతింటి కల సాకారం



మాకు ఇంతవరకు సొంతిల్లు లేదు. స్థలం కొనుగోలుచేసి కట్టుకునే ఆర్థికస్థోమత లేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఏర్పాటుచేసిన వైఎస్సార్‌జగనన్న కాలనీలో స్థలం, ఇల్లు మంజూరు చేశారు. పునాదులు తవ్వకున్నాం. ఇప్పటికే మాకు 40 బస్తాల సిమ్మెంట్‌ను ప్రభుత్వం హౌసింగ్ శాఖ నుంచి అందజేసింది. కొద్దినెలల్లో సొంతింటి కల సాకారం కానుంది. ఎవరి కాళ్లు పట్టుకోకుండానే మాకు సొంతింటి భాగ్యం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటాం.

– దబ్బాద జయలక్ష్మి, జి.అగ్రహారం, చీపురుపల్లి

బడి బాగుంది..



నాడు–నేడు కింద మా ఊరి బడిని అందంగా ముస్తాబు చేశారు. గతంలో కనీసం మరుగుదొడ్డి ఉండేది కాదు. ఇప్పుడు టైల్స్‌తో కూడిన గచ్చులు.. తాగునీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయాలు.. పిల్లలను ఆకర్షించేలా తరగతి గదులు, గోడలపై విజ్ఞానం పంచే చిత్రాలు.. ఇలా మా ఊరిబడి పూర్తిగా మారిపోయింది. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు కూడా మంచిగా చదువు చెబుతున్నారు. గతంలో మా పిల్లలు బడికి వెళ్లి వచ్చే సరికి దుస్తులు మొత్తం పాడయ్యేవి. ఇప్పుడు.. శుభ్రంగా ఉంటున్నాయి. పేదపిల్లల విద్యకోసం ఇన్ని సదుపాయాలు కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు. ఇంతకంటే మాకు ఇంకేం కావాలి.

– మీసాల భూలక్ష్మి, వంగపల్లిపేట

నిరీక్షణకు తెర



నేను గృహిణిని. ఉద్యోగం ఉన్నట్టు సోషల్ ఆడిట్‌లో చూపించడంతో రైస్ కార్డు మంజూరు చేయలేదు. ఫలితంగా వృద్ధాప్య పింఛన్, రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడ్డాను. జగనన్న సురక్ష కార్యక్రమం కింద వలంటీర్ ఇంటికి వచ్చి దరఖాస్తు చేసుకొని వార్డులో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో నాకు రైస్‌కార్డు అందజేశారు. ఇప్పుడు నేను పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. జనవరిలో పింఛన్ వస్తుందని వలంటీర్ బాబు తెలిపారు. చాలా ఆనందంగా ఉంది.

– గొడబ సుజాత దేవి, పార్వతీపురం పట్టణం

క్లుప్తంగా

39 మద్యం బాటిల్స్ పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిల్స్‌తో ఎస్సై

బలిజిపేట: మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని 39బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట శివాలయం వద్ద మాటువేసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కింజంగి గ్రామానికి చెందిన ఆర్.జగదీశ్వరరావు మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. బలిజిపేటలో మద్యం సీసాలను కొనుగోలు చేసి గోనెసంచిలో తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్టు ఎస్సై చెప్పారు.

108లో ప్రసవం



108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చిన గిరిజన మహిళ భవాని

కురుపాం: మండలంలోని పాడి పంచాయతీ సంతోషపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కె.భవాని 108 వాహనంలో గురువారం ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భవాని తీవ్ర పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు, గ్రామస్తులు, 108కు సమాచారం అందించారు. దీంతో వెంటనే గ్రామానికి చేరుకున్న వాహనం గర్భిణిని మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ వీఏ.నాయుడు, పైలెట్ జి.జోగేశ్వరరావు ప్రథమ చికిత్స అందించారు. కడుపులో ఉన్న బిడ్డ మెడకు పేగులు చుట్టుకుని ఉండడంతో చాకచక్యంగా చికిత్స అందించి డెలివరీ చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, ఆమెకు ఇది రెండో కాన్పు అని, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారని 108 సిబ్బంది వివరించారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రేమపేరుతో అసభ్యకరంగా ప్రవర్తించి, బెదిరించి బాలికను వంచించి లైంగికదాడికి పాల్పడిన గరివిడిలోని ఫేకర్ క్వార్టర్స్‌కు చెందిన కాకర్లపూడి రామ్‌కుమార్ వర్మపై బాధితురాలి ఫిర్యాదు మేరకు చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసును 2018లో అప్పటి ఎస్సై టి.క్రాంతికుమార్ నమోదుచేశారు. బొబ్బిలి డీఎస్పీ పి.సౌమ్యలత, గౌతమీషాలీ సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, చీపురుపల్లి ఎస్సై ఎ.సన్యాసినాయుడు, కోర్టు హెచ్‌సీ వేణునాయుడు, రైటర్ వెంకటరమణ, కానిస్టేబుల్ వెంకటరావులు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి బాధ్యతాయుతంగా వ్యవహరించారంటూ వారందరినీ అభినందించారు.

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాల అభ్యర్థులను సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకం కోసం అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి సందీప్ కుమార్ తెలిపారు. యూపీఎస్‌సీ నిర్వహించే ఈ పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. తొలుత ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం అందిస్తారని పేర్కొన్నారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో ఇప్పటికే అర్హత పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానించారు. అభ్యర్థి కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు 'జ్ఞానభూమి.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో పోర్టల్‌లో సూచించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

కులగణనకు కసరత్తు

- జిల్లాలో 27 నుంచి సర్వే
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వివిధ సామాజిక వర్గాల జనాభా సంఖ్యను తెలుసుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేకు జిల్లాల్లో కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ఈ నెల 14 నుంచి వివిధ స్థాయిల్లో శిక్షణ సాగుతోంది. ఇందులో భాగంగా మాస్టర్‌ట్రైనీలు తొలుత మండల స్థాయి ట్రైనీలకు టెలికాన్ఫరెన్స్ ద్వారా గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపతాయని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జిల్లావ్యాప్తంగా కులగణన ప్రారంభం కానుందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే జరుగుతుందని దీనికి జిల్లా యంత్రాంగం సిద్ధం కావాలని ఆదేశించారు. కులగణన గురించి ముందుగానే వలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి, అపోహలను తొలగించాలని సూచించారు. సర్వేలో కుంటుంబసభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అడగనవసరం లేదని స్పష్టం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఎవరి కులం వారికే నమోదు చేయాలని చెప్పారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే వారిని బలవంతం చేయకూడదని, ఇది స్వచ్ఛందమేనన్నారు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందని దీనిని ఏ ప్రైవేట్ సంస్థకు, వ్యక్తులకు ప్రభుత్వం వెల్లడించబోదని చెప్పారు.



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కులగణనలో భాగంగా ఈ నెల 27 నుంచి వారంరోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారు. ముందుగానే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన గురించి వివరిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీఓలు, మండల ప్రత్యేకాధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. వివరాల నమోదు కోసం ప్రత్యేక యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. కులగణన కోసం గ్రామ, మండల స్థాయితోపాటు, జిల్లా స్థాయిలో కూడా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వివిధ కుల సంఘాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలను పిలిచి కులగణన గురించి వివరిస్తారు. ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేసినప్పుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేస్తారు. వయసు 8 సంవత్సరాల లోపు ఉన్న వారికి ఈకేవైసీ తప్పనిసరి కాదు. ప్రతి కుటుంబానికి సర్వే పూర్తిచేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్‌మిట్ చేయా లని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణలో జేసీ మయూర్ అశోక్, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, సీపీఓ పి.బాలాజీ, డీఎల్‌డీఓ నిర్మలాదేవి, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల వివరాలు

కుటుంబసభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి.
- వ్యవసాయ భూమి వివరాలు
- నివాస స్థలం వివరాలు.

సర్వేలో సేకరించే వివరాలివే..

కుటుంబం అందుబాటులో ఉన్నారా/మరణించారా/శాశ్వతంగా వలస వెళ్లారా జిల్లా, జిల్లా కోడ్, మండలం/మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ/ పంచాయతీ కోడ్, వార్డు నంబర్, ఇంటినంబర్ కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబర్, కుటుంబసభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుని పేరు, కుటుంబ పెద్దతో గల సంబంధం, రేషన్ కార్డు నంబర్ కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు (కచ్చా, శ్లాబ్, డ్యూప్లెక్)
- ప్రస్తుతం చిరునామా
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా?
- మంచి నీరు/తాగునీరు సదుపాయం ఉందా? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్‌వెల్, సొంతకుళాయి)
- పశు సంపద ఏమైనా కలిగి ఉన్నారా? (ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు)
- వంట సాధనం (ఎల్‌పీజీ గ్యాస్, కిరోసిన్, కట్టెలు).

27 నుంచి కులగణన ప్రారంభం

పార్వతీపురం: కులగణన ఈనెల 27 నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. కులగణన ప్రక్రియపై గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, మండలఅధికారులతో వర్చువల్‌గా, కులసంఘాలతో ప్రత్యక్షంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కె.హేమలత, ఎస్.లావణ్య, డీపీఓ డి.సత్యనారాయణ, సీపీఓ పి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పాత్రికేయ వ్యవస్థ పవిత్రమైనది

- సెంచూరియన్ వర్సిటీ చాన్స్‌లర్ జీఎస్ఎన్.రాజు

విజయనగరం: సమాజానికి చుక్కానిగా వ్యవహరించే పాత్రికేయ వ్యవస్థ అత్యంత పవిత్రమైనదని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ జీఎస్ఎన్.రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన జాతీయ పత్రికా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మల్లా నిలుస్తాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగానికి విశిష్ట సేవలందిస్తున్న అనకాపల్లికి చెందిన కాంద్రేగుల కల్యాణ్ రామ్‌కు 2023 సంవత్సరానికి గాను జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా 200 మంది ఇంజినీరింగ్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు ప్రశంసపత్రాలు, పతకాలను ప్రదానం చేశారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమబుక్ రీడర్స్‌గా నిలిచిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన 20 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమంచి సుబ్బారావు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సన్యాసమ్మ, ట్రైబల్ యూనివర్సిటీ పరిపాలనాధికారి డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు, పశువులశాల దగ్ధం



దగ్ధమైన పూరిళ్లు

బలిజిపేట: మండలంలోని అజ్జాడ గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు, ఒక పశువుల శాల దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని గ్రామస్తుల అంచనా. గ్రామానికి చెందిన గెంబలి జయమ్మ, గొడబ రవణల పూరిళ్లు ప్రమాదంలో దగ్ధం కాగా జి.ఫకీరు పశువులశాల కాలిపోయింది. జయమ్మ ఇంటివద్ద వంటపనిచేస్తుండగా ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. నివాసగృహాలలోని నిత్యావసర సరుకులు, డబ్బులు, వంటపాత్రలు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు రోడ్డుపై పడ్డారని గ్రామస్తులు చెప్పారు. ఈ ప్రమాదంపై అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ముక్కాంలో కాలిన ఇల్లు

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెంఇన మైలపల్లి రాము కమ్మల ఇల్లు కాలిపోయినట్లు సమాచారం అందుకున్న వీఆర్‌ఓ లక్ష్మి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సుమారు రూ.30 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు వీఆర్‌ఓ అంచనా వేశారు.



శృంగవరపుకోట: మరుపల్లిలో కాలిపోతున్న ఇళ్లు

మరుపల్లిలో నాలుగు ఇళ్లు..

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధి కొత్త మరుపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సోకుల కొండమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు రేగి గ్యాస్‌స్టవ్, బట్టలు, వస్తుసామగ్రికి వ్యాపించాయి. అలాగే ఆ ఇంటి పక్కనే ఉన్న చింతల మల్లేష్, దురిమి ఎర్నాయుడు, పొన్నకాయల రాములమ్మ, ఇళ్లకు మంటలు విస్తరించడంతో ఒక్కసారిగా నాలుగు పూరిళ్లు కాలిపోయాయని బాధితులు వాపోయారు. ప్రమాద వార్త తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి వచ్చి మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.9.5లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, మరో రూ.20లక్షల నష్టాన్ని నివారించ గలిగామని ఎస్ఎఫ్ఓ మదీనా చెప్పారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు

బొండపల్లి: వరల్డ్‌కప్ క్రికెట్ (ఇండియా–న్యూజిల్యాండ్) సెమీఫైనల్ మ్యాచ్ సందర్భంగా బొండపల్లి మండలంలోని దేవుపల్లి గ్రామంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఆంధ్ర ఎస్సై ఎస్.సిద్ధార్థ కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి ఒక సెల్‌ఫోన్‌తో పాటు రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు.

18న టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

చీపురుపల్లి రూరల్: ఈనెల 18న ఉదయం 9గంటలకు చీపురుపల్లిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద 41వ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ జిల్లా స్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని టెన్నికాయిట్ అసోసియేషన్ స్టేట్‌సెక్రటరీ కేవీఎస్ సత్యనారాయణ గురువారం తెలిపారు. విజయనగరం అసోసియేషన్ ఆధ్వర్యంలో చీపురుపల్లి ఫైర్ అధికారి డి.హేమసుందరరావు సహకారంతో జరగనున్న ఎంపికలో ప్రతిభ చూపిన క్రీడాకారులు శ్రీకుకుళంలో జరగనున్న 41వ సీనియర్ టెన్నికాయిట్ స్టేట్‌మీట్‌లో ఆడతారని తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 17వ తేదీ మధ్యాహ్నం 12గంటల్లోగా వారి పేర్లు, వివరాలను పీడీ ఎం.రామారావు ఫోన్ (9494014059) నంబర్‌కు తెలియపరచాలన్నారు.

ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సరోగసి రెగ్యులేషన్ చట్టం -2021 ప్రకారం జిల్లాలో ఫెర్టిలిటీ కేంద్రాలను నిర్వహిస్తున్న వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఫెర్టిలిటీ కేంద్రాలు, క్లినిక్స్, బ్యాంక్స్ రిజిస్ట్రేషన్ కోసం అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లాస్థాయి పర్యవేక్షణ టీమ్ పరిశీలించి రాష్ట్రస్థాయికి సిఫారసు చేస్తుందని చెప్పారు. అక్కడ పరిశీలన తర్వాత అర్హత ఉన్న కేంద్రాలకు సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరైనా కేంద్రాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో గర్భస్థ లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాల్లో ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లయితే వారు కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

స్కూల్‌గేమ్స్‌లో నెల్లిమర్ల విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో అండర్-17 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి వి.హరిబాబు జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అండర్-19 విభాగం రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. త్రోబాల్ అండర్-19 విభాగంలో ఎస్.పూర్ణచంద్ర రెడ్డి, ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో ఎం.హర్షవర్ధన్ నాయుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారందరినీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఆనందమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీల పాత్రో, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి విజేతలను అభినందిస్తున్న హెచ్ఎం ఆనందరావు

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో గల శాంభవి లేఅవుట్‌లో ఒక మదుం వద్ద గుర్తు తెలియని యువకుడి(34) మృతదేహాన్ని స్థానికులు గురువారం రాత్రి గుర్తించారు. అటుగా వెళ్లే యువకులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఎస్.ముకుందరావు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై టీషర్ట్, షార్ట్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు.మృతదేహంపై ఎక్కడా ఎటువంటి దెబ్బలు, గాయాలు లేవని చెప్పారు. ఎక్కడో పూటుగా మద్యం తాగి తిరిగి మంచినీరు దొరక్క మృతి చెందాడేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు.



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ఘనంగా పైడితల్లి అమ్మవారి చండీయాగం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో గురువారం ఘనంగా జరిగింది. ఆలయ వేదపండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తిలు అమ్మవారి యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సెంచూరియన్‌లో ముగిసిన 'బయోవియో'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టిక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన 'న్యూ డ్రగ్ అండ్ మెటీరియల్ డిస్కవరీ, యూజింగ్ బయోవియో డిస్కవరీ అండ్ మెటీరియల్ స్టూడియో' అనే జాతీయ స్థాయి కార్యక్రమం గురువారంతో ముగిసింది. పర్యావరణానికి హాని కలగకుండా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి డసాల్ట్ రూపొందించిన బయోవియో సాఫ్ట్‌వేర్ సహకారంతో విద్యార్థులు ప్రయోగాలు చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రయోగాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు డిప్యూటీ స్పీకర్ అభినందన

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఇటీవల విశాఖలో జరిగిన పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత, మూడు కాంస్య పతకాలను సాధించినట్లు క్రీడాకారులు ఈ సందర్భంగా కోలగట్లకు తెలియజేశారు. అలాగే ఓవరాల్ చాంపియన్ షిప్‌లో మూడవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సాధించిన ఘనతపై కోలగట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. క్రీడాస్ఫూర్తితో మరింతగా రాణించి నగరానికి ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు సీతారామాంజనేయులు, రామకృష్ణ, సతీష్, బాక్సింగ్ విజేతలు పాల్గొన్నారు.



బాక్సింగ్ విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వైఎస్సార్‌సీపీతోనే సామాన్యులకు రాజ్యాధికారం

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- మీడియా సమావేశంలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బొద్దాంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం సిటీ/వంగర: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే సామాన్యులకు రాజ్యాధికారం దక్కిందని జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి తోడ్పాటునిస్తూ సామాజిక సాధికారత సాధించిందని వెల్లడించారు. రాజాంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా ప్రకటించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వెల్లడించారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటుచేసి ప్రపంచ పటంలో విజయనగరానికి అరుదైన గుర్తింపునిచ్చారన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల, జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో రూ.150 కోట్లతో ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల వంటి విద్యాసంస్థలను నెలకొల్పి విద్య, వైద్యరంగానికి పెద్దపీట వేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీరోగులకు సేవలందించేందుకు డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించారన్నారు. దీనిని త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అలాగే, ఉద్దానం వాసులకు రూ.800 కోట్లతో సురక్షితమైన తాగునీటి ప్రాజెక్టులను నిర్మించి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. మూలపేటలో పోర్టు నిర్మాణం చేపట్టి పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేస్తూ లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషిచేస్తున్నారన్నారు. 2024 సంవత్సరంలో జరగనున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని, జగన్ వస్తే పేదలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు.

బీసీలను విస్మరించిన టీడీపీ

గత టీడీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించిందని మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. ఒక్కశాతం ఓటు బ్యాంకు ఉన్న క్షత్రియ వర్గీయులకు అందలం ఎక్కించడంకోసం ఓ బీసీ మహిళను మంత్రి పదవినుంచి తప్పించారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదని, ఎస్టీ వర్గానికి చెందిన పాముల పుష్పశ్రీవాణి, పీడిక రాజన్నదొర వంటి గిరిజన నేతలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చి సామాజిక సాధికారతను చేతల్లో చూపించారన్నారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు సంక్షేమ పథకాలు అందించి, ఆయా కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపిన ఘనత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. అందుకే.. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారన్నారు.
- ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలు గమనించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. కోవిడ్ కష్టకాలంలో ప్రజల ప్రాణాలను రక్షించి దేశానికే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాజాం నియోజకవర్గం పరిశీలకుడు పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ యువనాయకులు తలే రాజేష్, కంబాల సందీప్, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్, టౌన్ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, పాలవలస శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.